సాక్షి
జోగులాంబ గద్వాల
గురువారం। 18। ఏప్రిల్। 2024



నగదు పట్టివేత

పోలీసులు చేపట్టిన వాహనాల తనిఖీల్లో భారీగా నగదు పట్టుబడింది.

వివరాలు 8లో ▸



బాధ్యతగా విధులు

సలేశ్వరం జాతరలో సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని డీఎఫ్‌ఓ రోహిత్‌రెడ్డి అన్నారు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
43.5/24.7

ఎండ ప్రభావం అధికంగా ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

బీజేపీలోకి మాజీ ఎమ్మెల్యే అబ్రహం..?



అలంపూర్: మాజీ ఎమ్మెల్యే అబ్రహం బీజేపీలో చేరుతున్నారనే పోస్టులు సోషల్‌మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఈమేరకు బీజేపీ రాష్ట్ర పెద్దలు ఆయనకు ఫోన్ చేసి సంప్రదింపులు జరుపుతున్నట్లు ప్రచారం సాగుతోంది. బీఆర్‌ఎస్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న తనను కాదని మరొకరికి టికెట్ కేటాయించడంతో అసంతృప్తికి గురైన ఆయన అసెంబ్లీ ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరి అందరికి ఆశ్చర్యానికి గురి చేశారు. తాజాగా బీజేపీలో చేరుతున్నారనే వార్తలకుతోడు ఎంపీ పోతుగంటి రాములుతో ఉన్న ఫోటోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఈ విషయమై ఆయన సన్నిహితులను ఆరా తీయగా.. పార్టీ మార్పు వార్తల్లో నిజం లేదని, కావాలని కొందరు పాత ఫోటోలను పోస్టు చేస్తున్నారని తెలిపారు. నోటిఫికేషన్ వెలువడనున్న ఈ తరుణంలో పార్టీల మార్పు అంశం ఏ మేరకు ఉంటుందో వేచి చూడాలి.

అలరించిన వసంత కవితోత్సవం

స్టేషన్ మహబూబ్‌నగర్: శ్రీరామ నవమిని పురస్కరించుకొని తెలంగాణ మహిళా సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక భారత్ స్కౌట్స్, గైడ్స్ భవనంలో వసంత కవితోత్సవం నిర్వహించారు. ఈకార్యక్రమానికి అవధాని చుక్కాయపల్లి శ్రీదేవి అధ్యక్షత వహించగా.. ప్రముఖ వక్త డా.పొద్దుటూరి ఎల్లారెడ్డి మాట్లాడారు. పితృవాక్య పాలకుడైన శ్రీరాముడి జగత్ ప్రసిద్ధమైన కల్యాణాన్ని వీక్షిస్తే, మంచి ఫలితం ఉంటుందన్నారు. రామాయణం అనేది కుటుంబ బంధమని అన్నారు. ప్రవచనకర్త డా.పల్లెర్ల రామ్మోహనరావు మాట్లాడుతూ రామాయణాన్ని మించిన వ్యక్తిత్వ వికాస గ్రంథం ప్రపంచంలో మరొకటి లేదన్నారు. రామనామస్మరణలో గొప్ప శక్తి దాగి ఉందని.. మానవాళి అనుసరించాల్సిన ఎన్నో విషయాలు రామాయణంలో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ మహిళా సాహిత్య సాంస్కృతిక సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు రావూరి వనజ, జి.శాంతారెడ్డి సమన్వయ కర్తలుగా వ్యవహరించగా.. కవులు బాదేపల్లి వెంకటయ్య, లక్ష్మణ్‌గౌడ్, గుముడాల చక్రవర్తి గౌడ్, జగపతిరావు, వెంకటేశ్వర్‌రావు, కమలేకర్ శ్యాంప్రసాద్‌రావు, అనురాధ, పులి జమున, సుజాత, రజని, మధుసూదన్ జోషి, మహేష్, రమేశ్, బసవ రాజప్ప, ప్రాణేష్, కృష్ణకుమార్ తదితరులు కవితలు వినిపించి ఆకట్టుకున్నారు.

నేటినుంచి యథావిధిగా మార్కెట్ లావాదేవీలు

దేవరకద్ర: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం సెలవు దినం కావడంతో వారానికి ఒక సారి జరిగే ఉల్లి వేలం జరగకపోవడంతో పాటు ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయి. గురువారం నుంచి మార్కెట్‌లో యథావిధిగా లావాదేవీలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

సివిల్స్ ర్యాంకర్ అనన్యరెడ్డికి సన్మానం

అడ్డాకుల: యూపీఎస్సీ ఫలితాల్లో జాతీయ స్థాయి మూడవ ర్యాంక్ సాధించిన పొన్నకల్ గ్రామవాసి దోనూరు అనన్యరెడ్డిని బుధవారం హైదరాబాద్‌లో దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి శాలువాతో సత్కరించి అభినందించారు. జాతీయ స్థాయిలో ర్యాంకు సాధించి, పాలమూరు జిల్లాకే కాకుండా రాష్ట్రానికే గర్వకారణంగా నిలిచారని కొనియాడారు. మహిమూద్, విజయకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



సిర్సనగండ్లలో మాంగళ్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎంపీ రాములు, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎంపీ అభ్యర్థులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, భరత్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, జైపాల్‌యాదవ్

జగదభిరాముడి కల్యాణం.. జగమంతా ఆనందం

వేలాది సంఖ్యలో తరలివచ్చిన భక్తుల రామనామస్మరణ మధ్య ఆ జగదభిరాముడు జానకమ్మను మనువాడాడు. రాముడు దోసిట తలంబ్రాలు నీలపురాసులుగా జానకి దోసిట తలంబ్రాలు మణిమాణిక్యాలై సాక్షాత్కరించిన వేళ.. సిర్సనగండ్ల క్షేత్రం భక్తి పారవశ్యంతో ఓలలాడింది. ఈ సందర్భంగా జైశ్రీరాం నినాదాలు మార్మోగాయి. స్వామివారి దర్శనం కోసం భక్తులు క్యూలైన్లలో గంటల తరబడి వేచిచూడాల్సి వచ్చింది. వీవీపీ తాకిడితో పాటు ఎండలు ఎక్కువగా ఉండడంతో భక్తులు కొంత ఇబ్బంది పడ్డారు. కల్యాణోత్సవానికి దాదాపు 30 వేల మందికి పైగా భక్తులు హజరైనట్లు దేవస్థాన చైర్మన్, ఈఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

నయనానందంగా సాగిన రాములోరి కల్యాణం

- జనసంద్రంగా మారిన సిర్సనగండ్ల క్షేత్రం
- మార్మోగిన జైశ్రీరామ్ నినాదాలు

చారకొండ: అపర భద్రాద్రిగా విరాజిల్లుతున్న సిర్సనగండ్ల క్షేత్రంలో జగదానంద కారకుడు, జగదాభిరాముడు కల్యాణ వేడుక...బుధవారం కనులపండువగా సాగింది. దేవదేవుడి కల్యాణవైభోగాన్ని.. కనులారా వీక్షించి భక్తజనం పులకించారు. ఉదయం 10 గంటలకు వేదమంత్రోచ్చారణలు, మేళతాళాలు, భక్తుల జయజయ ధ్వానాల మధ్య కల్యాణమూర్తులను ఊరేగింపుగా కల్యాణవేదిక వద్దకు తీసుకురాగా.. ఆలయ చైర్మన్ దేరం రామశర్మ పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. మధ్యాహ్నం 12 గంటలకు జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ ఘట్టాన్ని కనులపండువగా నిర్వహించారు. లోకమంతా వేయికళ్లతో ఎదురుచూసిన అభిజిత్ లగ్నంలో సీతమ్మ మెడలో రామయ్య మాంగళ్యధారణ చేశారు. జగదభిరాముడు మూడుముళ్లు వేసిన క్షణాన ముల్లోకాలు మురిశాయి.

■ సీతారామచంద్రస్వామి కల్యాణోత్సవంలో ఎంపీ రాములు, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు దంపతులతో పాటు మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, భరత్‌ప్రసాద్, బీజేపీ నేత ఆచారి తదితర ప్రముఖులు, అధికారులు పాల్గొన్నారు. కల్వకుర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్‌తో పాటు పలువురు ఎస్ఐలు పోలీసు బందోబస్తును పర్యవేక్షించారు. సిర్సనగండ్లకు చెందిన రాచమళ్ల నర్సింహ కుటుంబసభ్యులు వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం, రాంపురం గ్రామానికి చెందిన చిలుకాని బాల్‌రెడ్డి, వెంకటమ్మ జ్ఞాపకార్థం అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. భారతిసిమెంట్, ఇతర సేవా సంస్థల ద్వారా తాగునీటి వసతి, మజ్జిగ అందజేశారు. కాగా.. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల ప్రజాప్రతినిధులు, ఎంపీ అభ్యర్థులు, నాయకులు ఒకే వేదికపై కనిపించడం అందరి దృష్టిని ఆకర్షించింది.



గద్వాలలో ప్రత్యేక అలంకరణలో సీతారాముల ఉత్సవ విగ్రహాలు

కల్యాణం.. కమనీయం - వివరాలు 9లో..



గద్వాలలో సీతారాముల కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

కాంగ్రెస్‌లో కల్లోలం



మల్దకల్‌లో ఘర్షణ పడుతున్న కాంగ్రెస్ నాయకులు

గద్వాల కాంగ్రెస్‌లో ముదిరిన విభేదాలు

- జెడ్పీ చైర్‌పర్సన్ సరిత వర్సెస్ బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి
- నిన్న శాంతినగర్‌లో ఇద్దరి మధ్య మాటల యుద్ధం
- నేడు మల్దకల్‌లో ఇరు వర్గాల నేతల పరస్పర భౌతిక దాడులు
- నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికపై ప్రభావం?

గద్వాల రూరల్: నడిగడ్డ కాంగ్రెస్ పార్టీలో వర్గవిభేదాలు మరింత ముదిరాయి. శాసనసభ ఎన్నికల ఫలితాల అనంతరం చోటుచేసుకున్న వివిధ పరిణామాల నేపథ్యంలో ఎడముఖం పెడముఖంగా ఉంటూ వర్గాలుగా విడిపోయిన జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి మధ్య మంగళవారం రాత్రి శాంతినగర్‌లో మాటల యుద్ధం చోటుచేసుకోగా.. బుధవారం మల్దకల్‌లో ఇరు వర్గాల నాయకులు ఒకరిపై మరొకరు దాడులు చేసుకోవడం సంచలనం రేపుతుంది.

● శాసనసభ ఎన్నికల ముందు జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి ఇద్దరూ కలిసికట్టుగా బీఆర్‌ఎస్ పార్టీ నుంచి బయటకు వచ్చి కాంగ్రెస్ పార్టీలో చేరారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఇరువురు నేతలు ఐక్యంగానే ఉంటూ బీఆర్‌ఎస్‌ను ధీటుగా ఎదుర్కొన్నారు. అయితే ఫలితాలు వారి అంచనాలకు భిన్నంగా రావడంతో నాలుగు నెలలుగా ఇరువురి నేతల మధ్య దూరం పెరిగింది. ఈ క్రమంలోనే ఒకరిపై మరొకరు అంతర్గత చర్చలలో విమర్శలు ప్రతి విమర్శలతో ఆధిపత్య ప్రదర్శనకు పాల్పడ్డారు. ఇదిలా ఉండగా మంగళవారం పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంత్రి జూపల్లి కృష్ణారావు అలంపూర్ నియోజకవర్గంలో పర్యటించారు. ఈ సమాచారాన్ని తమకు ఇవ్వడం లేదని బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి సరితను గట్టిగా ప్రశ్నించడంతో పాటు ఎన్నికల సమయంలో ఖర్చు చేసిన డబ్బుల వ్యవహారం వంటి అంశాలు కూడా చర్చకు రావడం, ఇది కాస్తా ముదిరి ఇరువురి మధ్య మాటల యుద్ధం చోటుచేసుకుంది. జెడ్పీచైర్‌పర్సన్ సరితను దురుసు మాటలతో బాధపెట్టారని అక్కడే సరిత వర్గం నాయకులు బండ్ల చంద్రశేఖర్‌రెడ్డిపై దాడికి యత్నించగా పక్కనే ఉన్న పార్టీ నాయకులు సర్ది చెప్పారు.

ముష్టియుద్ధం..

కాగా.. బుధవారం ఎన్నికల ప్రచారాన్ని గద్వాల నియోజకవర్గంలోని మల్దకల్ మండలం నుంచి మొదలుపెట్టారు. ఈ క్రమంలో మల్దకల్‌లో ప్రచార రథం వాహనాన్ని ఎక్కేందుకు బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి సోదరుడు బండ్ల రాజశేఖర్‌రెడ్డి యత్నించగా వాహనంపై నున్న సరిత వర్గం నాయకుడు పెద్దొడ్డి రామకృష్ణ వాహనాన్ని ఎక్కవద్దని అడ్డుపడ్డాడు. ఈక్రమంలో ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈక్రమంలో అక్కడికి వచ్చిన బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి వాహనం ఎక్కవద్దు అనడానికి నీవెవరూ? అంటూ వాహనంపైనున్న పెద్దొడ్డి రామకృష్ణను చొక్కాపట్టుకొని కిందికి లాగాడు. దీంతో కోపోద్రిక్తుడైన పెద్దొడ్డి రామకృష్ణ వెంటనే బండ్ల చంద్రశేఖర్‌రెడ్డిపై దాడికి పాల్పడడంతో అతడు కిందపడిపోయాడు. దీంతో ఒక్కసారిగా ఘర్షణ వాతావరణం నెలకొనగా అక్కడే ఉన్న మరికొందరు పార్టీ కార్యకర్తలు బండ్ల చంద్రశేఖర్‌రెడ్డిపై ముష్టిఘాతాలు కురిపించడంతో అతను గాయపడ్డారు. అక్కడే ఉన్న బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి వర్గీయులు ఆయనను చికిత్స నిమిత్తం మల్దకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం గద్వాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

పార్లమెంట్ ఎన్నికలపై ప్రభావం..?


గద్వాల కాంగ్రెస్‌లో చోటుచేసుకుంటున్న నేతల మధ్య అనైక్యత, వర్గవిభేదాలు పార్లమెంటు ఎన్నికల్లో పార్టీకి నష్టం చేసేవిగా ఉండనున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఎన్నికల సమయంలో విభేదాలు పక్కన పెట్టి ఒక్కతాటిపై నడవాల్సిన నాయకులు ఇలా ముష్టియుద్ధాలకు దిగడంపై పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉద్దేశపూర్వకంగానే దాడి: బండ్ల రాజశేఖర్‌రెడ్డి



'తాము అసెంబ్లీ ఎన్నికల్లో సొంత బంధువర్గాన్ని కాదని బీసీ అభ్యర్థి అయిన సరితకు అండగా నిలబడి పార్టీ కోసం పనిచేశాం. అయితే వారు తమను లక్ష్యంగా చేసుకుని ఉద్దేశపూర్వకంగానే పార్టీలో అణచివేయాలని చూస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం గద్వాలకు వచ్చిన మంత్రి జూపల్లి, ఎంపీ అభ్యర్థి మల్లురవిని మా ఇంటికి అల్పాహారానికి ఆహ్వానించాం. అనంతరం ప్రచారం నిమిత్తం నేను మా సోదరుడు బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి కలిసి మల్దకల్‌కు వెళ్లాం. తాను ప్రచార వాహనంలో ఎక్కేందుకు వెళ్లగా అక్కడే సరిత వర్గానికి చెందిన పెద్దొడ్డి రామకృష్ణ అకారణంగా మాపై దాడికి పాల్పడ్డారు. ఈ దాడి ముందుగా వేసుకున్న ప్లాన్‌లో భాగంగానే జరిగింది. మళ్లీ బీసీలపై దాడి చేశారని అబద్ధపు ప్రచారం చేయడం మంచిది కాదు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లాం' అని బండ్ల రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

నాపై దాడికి పాల్పడ్డారు: పెద్దొడ్డి రామకృష్ణ



'తాను ప్రచార వాహనంపై ఉంటే బండ్ల చంద్రశేఖర్ రెడ్డి అకారణంగా నాపైకి వచ్చి నన్ను బూతులు తిడుతూ చొక్కా పట్టుకుని కిందకు లాగి దాడికి పాల్పడ్డారు. నాపై జరిగిన దాడి బీసీలపై జరిగిన దాడిగా అభిప్రాయ పడుతూ ఇలాంటి చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నాను. బీసీలు రాజకీయంగా ఎదుగుతుంటే ఓర్వలేకనే ఇలాంటి దాడులు చేశారు' అని పెద్దొడ్డి రామకృష్ణ అన్నారు.

బీఎస్పీ గూటికి మందా

- మాయవతి సమక్షంలో ఏనుగు పార్టీలో చేరిన మాజీ ఎంపీ జగన్నాథం
- నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బరిలో నిలిచే అవకాశం

అలంపూర్: లోక్‌సభ ఎన్నికల వేళ రాజకీయ సమీకరణాలు శరవేగంగా మారుతున్నాయి. పోటీయే ప్రధానం అన్నట్టుగా కొందరు ఉన్న పార్టీని వదిలి.. మరో పార్టీ కండువా కప్పుకొంటున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు 'కారు' దిగిన మాజీ ఎంపీ మందా జగన్నాథం.. ఆ తర్వాత 'చెయ్యి' అందుకున్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానానికి పోటీచేసే అవకాశం కల్పిస్తారని ఆశించగా, పార్టీ అధిష్టానం మరొకరికి టికెట్ కేటాయించింది. ఈనేపథ్యంలో మందా జగన్నాథం కాంగ్రెస్ పార్టీని వీడుతారనే ప్రచారం జోరుగా సాగింది. ఎట్టకేలకు ఆయన కాంగ్రెస్‌ను వీడి ఏనుగెక్కారు. బుధవారం బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు మందా ప్రభాకర్ ఆధ్వర్యంలో పార్టీ అధినేత్రి మాయావతిని రాజస్థాన్‌లో కలిసి, పార్టీ కండువా కప్పుకొన్నారు.



బీఎస్పీ అధినేత్రి మాయవతితో మాజీ ఎంపీ మందా జగన్నాథం

1996లో రాజకీయాల్లోకి ఆరంగేట్రం..

మాజీ ఎంపీ మందా జగన్నాథం 1996లో రాజకీయ ఆరంగేట్రం చేశారు. వైద్య వృత్తిలో కొనసాగిన ఆయన.. ఆ తర్వాత అనూహ్యంగా రాజకీయాల్లోకి వచ్చారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానం నుంచి 4 సార్లు ఎంపీగా ప్రాతినిధ్యం వహించారు. 1996, 1999, 2004 ఎన్నికల్లో టీడీపీ తరఫున, 2009లో కాంగ్రెస్ పార్టీ నుంచి 4వ సారి లోక్‌సభకు ఎన్నికయ్యారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధిగా నియమితులయ్యారు.

● బీఎస్పీలో చేరిన మందా జగన్నాథం నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానం నుంచి బరిలో నిలవనున్నారు. 2014లో బీఆర్‌ఎస్ నుంచి ఇదే స్థానం నుంచి పోటీచేసి ఓటమి చెందారు. ఆ తర్వాత 2019 ఎన్నికల్లో పోటీచేసే అవకాశం దక్కలేదు. 2023 అక్టోబర్ వరకు తెలంగాణ ప్రభుత్వం తరఫున రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి పనిచేసిన ఆయన పదవికి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. కాగా.. పార్లమెంట్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ టికెట్ దక్కకపోవడంతో బీఎస్పీ గూటికి చేరారు. కాగా, అలంపూర్ నియోజకవర్గానికి చెందిన ఇద్దరు నేతలు ఈ సారి నాగర్‌కర్నూల్ స్థానం నుంచి పోటీపడుతున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా అలంపూర్‌కు చెందిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ బరిలో ఉండగా.. కొండేరుకు చెందిన మందా జగన్నాథం బీఎస్పీ నుంచి బరిలో నిలుస్తున్నారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ బీఎస్పీని వీడి బీఆర్‌ఎస్ నుంచి బరిలో నిలవగా.. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్, అక్కడి నుంచి బీఎస్పీలో చేరిన మందా జగన్నాథం పోటీలో ఉండనుండటం కొసమెరుపు.

చతుర్ముఖ పోటీ..

మాజీ ఎంపీ మందా జగన్నాథం బీఎస్పీలో చేరడం.. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేయనుండడంతో పరిణామాలు రసవత్తరంగా మారాయి. మందా జగన్నాథం అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరగా.. తాజాగా హస్తం వదిలి బీఎస్పీలోకి చేరారు. దీంతో అన్ని పార్టీలు బలమైన అభ్యర్థులను బరిలో దించగా.. చతుర్ముఖ పోటీ తప్పదని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ నుంచి మల్లురవి, బీజేపీ నుంచి ఎంపీ రాముడు కుమారుడు భరత్‌ప్రసాద్, బీఆర్‌ఎస్ నుంచి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, తాజాగా బీఎస్పీ నుంచి మందా జగన్నాథం పోటీ పడనున్నారు. నలుగురు అభ్యర్థుల్లో ఇద్దరు అలంపూర్ నియోజకవర్గానికి చెందినవారు కాగా మరో ఇద్దరు పార్లమెంట్ సెగ్మెంట్‌కు చెందినవారు కావడం విశేషం.

నేటి నుంచి లోక్‌సభ ఎన్నికల నామినేషన్లు

- ఖరారైన ప్రధాన పార్టీ అభ్యర్థుల ముహూర్తాలు
- ఈ నెల 25 వరకు స్వీకరణ

సాక్షి, నాగర్‌కర్నూల్: లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల పర్వం మొదలైంది. గురువారం నుంచే అభ్యర్థుల నామినేషన్లను స్వీకరించనున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో లోక్‌సభ అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈ నెల 25 వరకు అభ్యర్థుల నుంచి నామినేషన్ పత్రాలను స్వీకరించనుండగా.. ఈ నెల 29 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉండనుంది. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కావడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు తాము నామినేషన్ వేసేందుకు ముహూర్తాలను ఖరారు చేసుకున్నారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లు తమ అభ్యర్థుల నామినేషన్ సందర్భంగా జాతీయ, రాష్ట్ర స్థాయి ముఖ్య నేతల హాజరు, భారీ ర్యాలీలతో నామినేషన్ వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయి.

బడా నేతలు హాజరు..

ముహూర్త బలం దృష్టిలో ఉంచుకుని ప్రధాన పార్టీల అభ్యర్థులు ఈ నెల 19, 23, 24, 25 తేదీల్లో నామినేషన్ పత్రాలను దాఖలు చేసేందుకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఈ నెల 19న మొదటి సెట్టు నామినేషన్ పత్రాలను దాఖలు చేయనున్నారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి హాజరవుతారని తెలుస్తోంది. అలాగే ఈ నెల 24న పార్టీ శ్రేణులతో కలిసి భారీ ర్యాలీతో మరోసారి నామినేషన్ వేసేందుకు ఏర్పాట్లు సాగుతున్నాయి. ఆ రోజున బీఆర్‌ఎస్ ముఖ్య నేతలు హరీశ్‌రావు హాజరవుతారని సమాచారం. కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవి ఈ నెల 23న నామినేషన్ వేసేందుకు సిద్ధం అవుతున్నారు. నామినేషన్ రోజున పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్‌కు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరవుతారని పార్టీ నేతలు భావిస్తున్నారు. బీజేపీ తమ అభ్యర్థుల నామినేషన్ల ఘట్టానికి జాతీయ స్థాయి నేతలు, కేంద్ర మంత్రులు, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులను రంగంలోకి దింపనుంది. ఈ నెల 25న బీజేపీ అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్ నామినేషన్ పత్రాలను దాఖలు చేయనుండగా.. నామినేషన్ కార్యక్రమానికి గుజరాత్ సీఎం భూపేంద్రపటేల్ హాజరుకానున్నారని సమాచారం.

ఓటు అడిగే హక్కు కాంగ్రెస్‌కే ఉంది..

- 60 ఏళ్ల కల సాకారం చేసిన ఘనత పార్టీదే : మంత్రి జూపల్లి
- కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం : ఎంపీ అభ్యర్థి మల్లు రవి

గద్వాల రూరల్/గట్టు/మల్దకల్/ధరూరు: మిగులు రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చడంతోపాటు పేదల సంక్షేమాన్ని గాలికొదిలిన కేసీఆర్‌కు రాష్ట్ర ప్రజలను ఓటు అడిగే హక్కు లేదని, రాష్ట్ర ప్రజల 60 ఏళ్ల ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను నెరవేర్చిన నాయకురాలు సోనియాగాంధీ అని, ఓటు అడిగే హక్కు కాంగ్రెస్ పార్టీకి మాత్రమే ఉందని ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం గట్టు, మల్దకల్, ధరూరు, గద్వాలలో మల్లురవితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కేసీఆర్ ఇచ్చిన హామీలు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, రూ.లక్ష రుణ మాఫీ, ఇంటికో ఉద్యోగం, కేజీటూపీజీ ఉచిత విద్య ఏమయ్యాయని ప్రశ్నించారు. బీజేపీ పార్టీ దేశాన్ని అన్ని రకాలుగా నాశనం చేసిందని, రాముడు అందరి దేవుడని అలాంటి శ్రీరామచంద్రుడిని కూడా రాజకీయాలకు వాడుకుంటున్న పార్టీ బీజేపీ అని విమర్శించారు. ప్రస్తుత ఎంపీ రాములు బీఆర్‌ఎస్ పార్టీలో గెలిచి ఇప్పుడు తన కుమారుడిని బీజేపీ పార్టీ నుంచి ఎంపీ అభ్యర్థిగా పోటీలో పెట్టారని వారికి ఓటుహక్కు అడిగే హక్కులేదన్నారు. అలాగే ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అసెంబ్లీ ఎన్నికల ముందు కేసీఆర్‌ను తిట్టినతిట్టు తిట్టకుండా తిట్టి.. ఇప్పుడు అదే పార్టీలో చేరి తన నైతికతను పోగొట్టుకున్నారని, ఆయన ఓటు ఎలా అడుగుతారని ప్రశ్నించారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు వచ్చాయని, అలాంటి పార్టీని గెలిపించాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అండగా ఉన్నారని మరోసారి అండగా నిలబడి రాహుల్‌గాంధీని ప్రధాని చేయాలని కోరారు. ఇక్కడ మల్లురవిని ఎంపీగా గెలిపించాలని కోరారు.

● ప్రాజెక్టులు నిర్మించి, బీడు భూములకు సాగునీటిని అందించింది కాంగ్రెస్ పార్టీ అని, అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిందని నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి మల్లురవి అన్నారు. చేసిన అభివృద్ధి, తీసుకొచ్చిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, సంపత్‌కుమార్, బీఎస్ కేశవ్, మధుసూదన్‌బాబు పార్టీ నాయకులు పాల్గొన్నారు.



ధరూరులో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

ధరూరులో ఆందోళన..

ఇదిలాఉండగా, కాంగ్రెస్ నాయకుడు బండ్ల చంద్రశేఖర్‌రెడ్డిపై మల్దకల్‌లో దాడి జరగగా.. ఇతర మండలాలకు చెందిన వారు ఇక్కడికి ఎందుకు వచ్చారంటూ ఆయన వర్గీయులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇక్కడ కాంగ్రెస్ సభ నిర్వహించనివ్వమని.. ప్రచార వాహనంలో పాటలు ఆపాలని అడ్డు చెప్పారు. ఈక్రమంలో ఎస్ఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ఆందోళన చేస్తున్న కార్యకర్తలకు సర్దిచెప్పారు. దీంతో నాయకులు ప్రచార వాహనంపై నుంచి మాట్లాడి వెళ్లిపోయారు.

భక్తకోటి పరవశం

భక్తిశ్రద్ధలతో శ్రీరామ నవమి వేడుకలు

- కనులపండువగా రాములోరి లగ్నం
- మార్మోగిన రామనామస్మరణ.. పులకించిన భక్తజనం

శ్రీరామ నవమిని పురస్కరించుకొని బుధవారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రసిద్ధ ఆలయాల్లో సీతారాముల కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. చలువ పందిళ్ల కింద కల్యాణ వేదికలను సుందరంగా ముస్తాబు చేయగా.. కల్యాణ వేడుకను భక్తకోటి తిలకించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వేదమంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల మధ్య సీతారామచంద్రాస్వామి ఉత్సవ మూర్తులను పట్టువస్త్రాలతో అలంకరించి.. అభిజిత్ లగ్నంలో రుత్వికులు జీలకర్ర బెల్లం పెట్టారు. అనంతరం మాంగళ్యధారణ, తలంబ్రాల కార్యక్రమం నిర్వహించారు. సీతారాముల కల్యాణ వేడుకను భక్తులు కనులారా తిలకించి పులకించిపోయారు. ఈసందర్భంగా రామనామస్మరణ మార్మోగింది.

- మహబూబ్‌నగర్ రూరల్/స్టేషన్ మహబూబ్‌నగర్/కోయిల్‌కొండ/జోగుళాంబ శక్తిపీఠం/ఎర్రవల్లిచౌరస్తా

మన్యంకొండలో సంప్రదాయబద్ధంగా..



కల్యాణ ఘట్టం నిర్వహిస్తున్న ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్

ప్రతి ఏడాది శ్రీరామనవమి రోజు మన్యంకొండలో శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా శోభాయమానంగా అలంకరించిన పల్లకీలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను గర్భగుడి నుంచి దేవస్థానం సమీపంలోని రామసదనం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చి, స్వామివారి కల్యాణ ఘట్టాన్ని సంప్రదాయబద్ధంగా జరిపించారు. వేదమంత్రోచ్చారణలు, సన్నాయి వాయిద్యాలు, అశేష భక్తజనం నడుమ అమ్మవారికి మంగళసూత్ర ధారణ, తలంబ్రాల కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను పల్లకీలో మళ్లీ గర్భగుడి వద్దకు తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, అళహరి రామకృష్ణ, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందాచారి తదితరులు పాల్గొన్నారు.

పాలమూరులో ఆధ్యాత్మిక శోభ



ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు



టీచర్స్‌కాలనీ రామాలయంలో సీతారాముల కల్యాణం తిలకిస్తున్న భక్తులు

శ్రీరామ నవమిని పురస్కరించుకొని పాలమూరులో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. పలు ఆలయాలను సుందరంగా ముస్తాబు చేసి, సీతారాముల కల్యాణోత్సవాన్ని నయనానందంగా నిర్వహించారు. టీచర్స్ కాలనీ సీతారామచంద్రాస్వామి ఆలయం, పంచముఖ ఆంజనేయ స్వామి, శ్రీనివాసకాలనీ అభయాంజనేయస్వామి, అప్పన్నపల్లి, ఏనుగొండ, రాజేంద్రనగర్, శివశక్తినగర్ కాలనీ, భూలక్ష్మికాలనీ, అయోధ్యనగర్, హనుమాన్‌పూరల్లో జరిగిన శ్రీరామనవమి వేడుకల్లో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీనివాస కాలనీ ఆంజనేయస్వామి, టీచర్స్‌కాలనీ రామాలయం, సంజయ్‌నగర్‌కాలనీ, టీడీగుట్ట, కుమ్మరివాడ వీరాంజనేయస్వామి తదితర ఆలయాల్లో నిర్వహించిన సీతారాముల కల్యాణోత్సవంలో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొని తిలకించారు. అప్పన్నపల్లిలోని ఆంజనేయస్వామి ఆలయంలో జరిగిన శ్రీరామనవమి వేడుకల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి సతీ సమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

మదినిండా రామనామం



కల్యాణతంతు జరిపిస్తున్న అర్చకులు

బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని కోదండరామస్వామి ఆలయంలో సీతారామస్వామి కల్యాణ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు సీతారామస్వామికి ఉదయం 6 గంటలకు సుప్రభాతసేవ, అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం ఉదయం 10గంటలకు వేదమంత్రాల నడుమ సీతారాములకు కనులపండువగా కల్యాణాన్ని జరిపారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. భక్తులు ఉదయాన్నే బీచుపల్లికి చేరుకొని భక్తిశ్రద్ధలతో సీతారాముల కల్యాణంలో పాల్గొని తిలకించారు. కల్యాణానికి హాజరైన భక్తుల కోసం రంగాపురానికి చెందిన ఆవుల చిన్నకృష్ణ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. భక్తుల రాకను దృష్టిలో ఉంచుకొని ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ మేనేజర్ సురేందర్‌రాజు పేర్కొన్నారు. అదేవిధంగా బీచుపల్లి అభయాంజనేయస్వామి ఆలయంతో పాటుగా మండలంలోని వివిధ గ్రామాల్లో సీతారాముల కల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు.



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

శ్రీరామకొండ.. జనసంద్రం

ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శ్రీరామకొండ క్షేత్రంలో సీతారామస్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. రామయ్య కల్యాణోత్సవంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొని తిలకించారు. నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి దంపతులు సీతారాముల కల్యాణంలో పాల్గొనగా.. కోయిల్‌కొండకు చెందిన లక్ష్మీనారాయణగౌడ్ బియ్యం గింజలపై శ్రీరామనామం రాసి, తలంబ్రాలుగా అందజేశారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

శ్రీరామకొండలో సీతారాముల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు →



ఐదో శక్తిపీఠంలో..



అలంపూర్‌లో సీతారాముల కల్యాణం తిలకిస్తున్న భక్తులు

అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి క్షేత్రంలో శ్రీరామ నవమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అభిజిత్ లగ్నంలో సీతారాముల కల్యాణం జరిపించారు. జూనియర్ సివిల్ కోర్టు జడ్జి కమలాపురం కవిత, ఆలయ కమిటీ చైర్మన్ చిన్నకృష్ణయ్య, పాలక మండలి సభ్యులు నీలప్ప, వెంకటేశ్వర్‌రెడ్డి, సి.వెంకటేష్, వెంకటనారాయణరెడ్డి, ప్రధాన అర్చకుడు ఆనంద్‌శర్మ, ప్రహ్లాదాచారి, ధనుంజయశర్మ, త్యాగరాజ శర్మ, కృష్ణమూర్తి శర్మ, పృథ్వినాథశర్మ పాల్గొన్నారు.

కొండారెడ్డిపల్లిలో సీఎం కుటుంబసభ్యుల పూజలు



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న సీఎం భార్య గీత, చిత్రంలో సీఎం సోదరుడు

వంగూరు: సీతారాముల కల్యాణ మహోత్సవం బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో అంగరంగ వైభవంగా కొనసాగింది. సీఎం రేవంత్‌రెడ్డి స్వగ్రామమైన కొండారెడ్డిపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో జరిగిన సీతారాముల కల్యాణ మహోత్సవంలో సీఎం భార్య గీత, కుమార్తె నైమిషతో పాటు సోదరులు తిరుపతిరెడ్డి, కొండల్‌రెడ్డి, కృష్ణారెడ్డి దంపతులు పాల్గొన్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు భాజ భజంత్రీలు, పండితుల వేదమంత్రాలతో కల్యాణ మహోత్సవం ఘనంగా కొనసాగింది. స్వామివారికి కృష్ణారెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు.

క్లుప్తంగా

చెరువులో గల్లంతైన వ్యక్తి మృతి

పెబ్బేరు రూరల్: వనపర్తి నల్లచెరువులో మంగళవారం స్నానం చేయడానికి వెళ్లి గల్లంతమైన ఉందేకోటి కృష్ణయ్య (42) మృతి చెందాడు. బుధవారం మృతదేహాన్ని గుర్తించినట్లు వనపర్తి పట్టణ ఎస్‌ఐ రామరాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి పట్టణంలోని రాయిగడ్డకు చెందిన బాలరాం, కృష్ణయ్య వారి బావమరిదితో కలిసి మంగళవారం మధ్యాహ్నం స్నానం చేసేందుకు నల్లచెరువుకు వెళ్లారు. స్నానం చేస్తున్న క్రమంలో కృష్ణయ్య నీటిలో పడిపోయాడు. అతనికి ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయాడు. మంగళవారం నుంచి కృష్ణయ్య కోసం చెరువులో వెతుకుతూ రాత్రి కావడంతో, బుధవారం గజ ఈతగాళ్లతో వెతికించగా మధ్యాహ్నం మృతదేహం లభ్యమైంది. భార్య చిట్టెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఘటనా స్థలాన్ని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి, జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పరిశీలించి, బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు: యువకుడి దుర్మరణం

నాగర్‌కర్నూల్ క్రైం: ద్విచక్రవాహనాన్ని, ఇన్నోవా వాహనం ఎదురెదురుగా ఢీకొట్టడంతో యువకుడు మృతిచెందిన సంఘటన జిల్లా కేంద్రంలోని వెలమ పంక్షన్‌హాల్ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని చందుబట్లకి చెందిన శివ(26) కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఇతను ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వెళ్తుండగా.. ఎదురుగా వచ్చిన ఇన్నోవా వాహనం జిల్లా కేంద్రంలోని వెలమ పంక్షన్ హాల్ సమీపంలో ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. సంఘటనకు సంబంధించి ఎస్‌ఐ గోవర్ధన్‌ను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలియజేశారు.

కోయిల్‌సాగర్‌లో 13 అడుగుల నీటిమట్టం

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో బుధవారం 13 అడుగులకు నీటిమట్టం చేరింది. ఇటీవల యాసంగి పంటలకు కుడి, ఎడమ కాల్వల ద్వారా విడతల వారీగా నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం రెండు కాల్వల తూములను మూసి వేశారు. ప్రస్తుతం కోయిల్‌కొండ వైపు ఉన్న మోటార్ ద్వారా మిషన్ భగీరథ పథకానికి నీటిని పంపింగ్ చేస్తున్నారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

- వన్యప్రాణులకు నష్టం కలగకుండా చర్యలు
- డీఎఫ్‌ఓ రోహిత్‌రెడ్డి



అటవీశాఖ అధికారులతో మాట్లాడుతున్న డీఎఫ్‌ఓ రోహిత్‌రెడ్డి

మన్ననూర్: సలేశ్వరం ఉత్సవాల్లో అటవీశాఖ అధికారులు, సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహించాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓ, డీఎఫ్‌ఓ రోహిత్‌రెడ్డి సూచించారు. బుధవారం మన్ననూర్‌లోని వనమాళికా ప్రాంగణంలో ఆయన అధికారులు, సిబ్బందితో వేర్వేరుగా చర్చించారు. అటవీ పరిసరాలు, వన్య ప్రాణులకు నష్టం కలగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన ప్రతి విషయంలో తగినన్ని జాగ్రత్తలు పాటించాలన్నారు. మూడు రోజుల పాటు ఉత్సవాల కోసం నియమిస్తున్న వలంటీర్లను సంయమనం చేసుకుంటూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది, స్థానికులు, పత్రికా విలేకర్లు అందరూ ఉత్సవాలు విజయవంతంగా పూర్తయ్యేలా అటవీ శాఖకు సహకరించాలన్నారు. అదేవిధంగా అటవీలో నిప్పు రాకుండా, ప్లాస్టిక్ తదితర వ్యర్థ పదార్థాలు పడేయకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎఫ్‌ఆర్‌ఓ ఈశ్వర్, డీఆర్‌ఓ రవికుమార్, శ్వేత, ఎఫ్ఎస్‌ఓలు, బీట్ ఆఫీసర్లు తదితరులు ఉన్నారు.

కారుతో ఢీకొట్టి.. కర్రలతో దాడిచేసి

- దాయాదుల మధ్య ఘర్షణ
- భూ తగాదాలే కారణం



ఘటన స్థలంలో గాయపడిన అజీజ్

బిజినేపల్లి: భూ తగాదాలు శ్రుతిమించి ప్రాణాలు తీసే వరకు వచ్చాయి. బుధవారం ఉదయం తిమ్మాజీపేట మండలంలోని గోరిటలో ఓ వ్యక్తిని అదే గ్రామానికి చెందిన ముగ్గురు కలిసి కారుతో ఢీకొట్టి, కర్రలతో దాడి చేసినట్లు ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. గ్రామంలోని ఎండీ అజీజ్ కుటుంబానికి, అదే గ్రామానికి చెందిన ఎండీ మతిన్, ఎండీ హఫీజ్, ఎండీ జాఫర్ కుటుంబాలకు మధ్య కొంతకాలంగా భూ తగాదాలు ఉన్నాయి. మతిన్, హఫీజ్ భూమి విషయంలో తనపై దాడి చేశారని ఎండీ అజీజ్ రెండ్రోజుల కిందట స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో బుధవారం ఉదయం ముగ్గురు కలిసి రోడ్డు పక్కనే కూర్చొని ఉన్న అజీజ్‌ను కారుతో ఢీకొట్టడంతో రోడ్డు పక్కకు పడిపోయాడు. వెంటనే కారులో నుంచి దిగి కర్రలతో దాడి చేశారు. అటుగా వెళ్తున్న గ్రామస్తులు చూసి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పాటు దాడిని అడ్డుకున్నారు. కాసేపటికి ముగ్గురు అక్కడి నుంచి పారిపోయారు. వెంటనే అజీజ్‌ను 108 వాహనంలో మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్రీడలతో దేహదారుఢ్యం



జీబీపీఎల్ లీగ్‌లో టాస్ వేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్

మహబూబ్‌నగర్ క్రీడలు: క్రీడలతో మానసిక వికాసంతో పాటు దేహదారుఢ్యం పెంపొందుతుందని మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎండీసీఏ మైదానంలో బుధవారం గోర్ బంజారా ప్రీమియర్ లీగ్ సీజన్–7 క్రికెట్ టోర్నీ కొనసాగింది. ఈసందర్భంగా సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి మున్సిపల్ చైర్మన్ పూలమాలవేసి పూజలు చేశారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని మాట్లాడారు. జిల్లా క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలని.. ఇలాంటి క్రీడా పోటీలకు తనవంతు సహకారం ఉంటుందని తెలిపారు. కాగా, రెండో రోజు జరిగిన మ్యాచుల్లో లోకా మసంద్ జట్టు 20 పరుగుల తేడాతో లక్కీషా బంజారా జట్టుపై గెలుపొందింది. మరో మ్యాచ్‌లో ఏకలవ్య జట్టు 13 పరుగుల తేడాతో కొమురం భీం జట్టుపై విజయం సాధించింది. టోర్నీలో విన్నర్ జట్టుకు రూ.1,00,155, రన్నరప్ జట్టుకు రూ.50.155 నగదు బహుమతితో పాటు ట్రోఫీలు అందజేస్తామని జీబీపీఎల్ కమిటీ చైర్మన్ రమావత్ రవిరాథోడ్ తెలిపారు. కార్యక్రమంలో ధాక్యానాయక్, పున్యానాయక్, మోహన్‌నాయక్, చందర్ రాథోడ్, ఆలిండియా బంజారా సేవా సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.శేఖర్ నాయక్, పాపారాయుడు, కౌన్సిలర్లు మోతీలాల్‌నాయక్, నర్సింహులు పాల్గొన్నారు.

టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి



మాట్లాడుతున్న టీపీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: 2010 కంటే ముందు నియమితులైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని టీపీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్వతి సత్యనారాయణ కోరారు. జిల్లా కేంద్రంలోని యూనియన్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్‌సీటీఈ నుంచి సవరణ ఉత్తర్వులు ఇచ్చేవిధంగా ప్రభుత్వం కృషి చేయడంతో పాటు వేసవి సెలవుల్లో ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఉపాధ్యాయులకు కొన్నేళ్లుగా బదిలీలు, పదోన్నతులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రెండేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న మెడికల్, జీపీఎఫ్, సరెండర్ బిల్లులను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో టీపీఆర్టీయూ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ యుగంధర్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్యాంబాబు, రమాకాంత్, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగిరెడ్డి, రాకేష్‌రెడ్డి, సతీష్‌కుమార్, శ్రీధర్, భూపతిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వరంగ సంస్థలను కొల్లగొట్టడమే బీజేపీ కర్తవ్యం

- కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి డా.వంశీచంద్‌రెడ్డి



మాట్లాడుతున్న వంశీచంద్‌రెడ్డి

అమరచింత: పదేళ్ల పాలనలో కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో కొనసాగుతున్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ రంగాలకు అప్పజెప్పి, దేశ సంపదను కొల్లగొట్టడమే బీజేపీ ప్రభుత్వం ప్రధాన కర్తవ్యంగా పెట్టుకుందని మహబూబ్‌నగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి అన్నారు. మండలంలోని నాగల్‌కడ్మూర్‌లో సీతారామస్వామి కల్యాణంలో ఆయన సతీమణితో హాజరయ్యారు. కల్యాణం అనంతరం కాంగ్రెస్ ముఖ్య నాయకులు, శ్రీరాం భూపాల్‌తో కలిసి సమావేశంలో పాల్గొన్నారు. దేశాన్ని మతోన్మాద ముసుగులో దోచుకుంటున్న పార్టీకి తగిన బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. దేశాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లి, ప్రభుత్వరంగ సంస్థలను విస్తరించి, ఉద్యోగ అవకాశాలు కల్పించి, పేదలను ఆదుకున్న కాంగ్రెస్ పార్టీపై బీజేపీ నాయకులు విమర్శలు చేయడం వింతగా ఉందన్నారు. బ్యాంకుల్లో రుణాలు తీసుకుని దేశం వదిలి వెళ్లిన వ్యక్తులకు రక్షణ కల్పిస్తూ.. వారి అప్పులను మాఫీ చేస్తుంది ప్రధాని మోదీ అనే విషయాన్ని ప్రజలు మరిచిపోలేరన్నారు. మహబూబ్‌నగర్‌ను దత్తత తీసుకుంటానని పదేళ్ల పాటు మోసం చేసిన మాజీ సీఎం కేసీఆర్‌కు ప్రజలు సరైన బుద్ధి చెప్పారన్నారు. ఇదే తరహాలో కేంద్రంలో ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన బీజేపీకి తగిన బుద్ధి చెబుతారన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని, పార్టీ గెలుపులో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో శ్రీరాంభూపాల్, టీపీసీసీ కల్లుగీత డిపార్ట్‌మెంట్ రాష్ట్ర చైర్మన్ కేశం నాగరాజ్ గౌడ్, జలంధర్ రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

రూ. 3,15 లక్షల నగదు పట్టివేత


రాజాపూర్: ఉమ్మడి జిల్లాలో వేర్వేరు చోట్ల పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టి రూ.3,15 లక్షల నగదు పట్టుకున్నారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాజాపూర్ శివారులో రంగారెడ్డిగూడ వద్ద బుధవారం జాతీయ రహదారిపై ఎస్‌ఐ రవి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. అందులో రూ.2,15,000 నగదు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ నుంచి ఆత్మకూర్‌కు వెళ్తున్న అహ్మద్‌పాషా, సహదేవ్ నాయుడు, బీచుపల్లి వద్ద నగదుకు సంబంధించి ఎటువంటి వివరాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నగదును ఎలక్షన్ గ్రీవెన్స్ కమిటీ మహబూబ్‌నగర్‌కు పంపించినట్లు తెలియజేశారు.

పాన్‌గల్‌లో రూ.లక్ష..

పాన్‌గల్: పాన్‌గల్ మండలం తెల్లరాళ్లపల్లి స్టేజీ సమీపంలో చెక్‌పోస్టు వద్ద బుధవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా.. రూ.లక్ష నగదు పట్టుబడినట్లు ఎస్‌ఐ వేణు తెలిపారు. ఎలాంటి రశీదు లేకుండా కొల్లాపూర్ మండలం సింగోటం నుంచి జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం గార్లపాడుకు చెందిన కుర్వ ఉస్సేన్ బొలెరో వాహనంలో నగదు తీసుకువెళ్తుండగా గుర్తించి సీజ్ చేసినట్లు చెప్పారు. ఎన్నికల నిబంధనాల ప్రకారం ఒక వ్యక్తి రూ.50 వేల కంటే ఎక్కువ నగదును వెంట తీసుకెళ్లాలంటే రశీదులు గాని, బ్యాంకు కౌంటర్ ఫైల్స్ గాని తప్పనిసరిగా ఉండాలని సూచించారు.

ఆస్పత్రిలో తల్లి, శిశువు మృతి

వైద్యుల నిర్లక్ష్యమేనంటూ కుటుంబసభ్యుల ఆందోళన



గోవిందమ్మ (ఫైల్)

నారాయణపేట రూరల్: కాన్పు చేస్తుండగా బిడ్డతో పాటు తల్లి మృతిచెందిన ఘటన జిల్లా ఆస్పత్రిలో బుధవారం చోటు చేసుకుంది. ఇందుకు వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. బాధిత కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మద్దూర్ మండలం భీంపురం గ్రామానికి చెందిన రోషనప్పకు 15 ఏళ్ల కిందట గోవిందమ్మతో వివాహం జరిగింది. ఇద్దరు మగపిల్లలు పుట్టగా ఒకరు మృతిచెందారు. తాజాగా మూడోకాన్పు కోసం మద్దూర్ పీహెచ్‌పీకి వెళ్లగా పరీక్షించిన వైద్యులు జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేశారు. దీంతో బుధవారం మధ్యాహ్నం జిల్లా ఆస్పత్రికి వచ్చారు. కాన్పు చేసే సమయంలో గోవిందమ్మ ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో వైద్యులు సిజేరియన్ చేసేందుకు ప్రయత్నం చేయగా తల్లీ బిడ్డ మృతిచెందారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు రోదిస్తూ ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. వీరికి సీపీఐ, పీడీఎస్‌యూ నాయకులు మద్దతు తెలిపారు. చివరకు పోలీసులు జోక్యం చేసుకొని సముదాయించడంతో శాంతించారు.

⇨ ఈ ఘటనపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. రంజిత్ మాట్లాడుతూ.. కాన్పు చేసే సమయంలో వైద్యులు జాగ్రత్తగా వ్యవహరించారని, నిర్లక్ష్యం ఎక్కడా జరగలేదన్నారు. గర్భిణికి పల్స్‌రేట్ పడిపోవడం, ఆయాసం రావడంతో ఆక్సిజన్ అందించి వైద్యం చేసినట్లు తెలిపారు. వైద్యుల బృందం ఎంత ప్రయత్నం చేసినా బతకలేదని వివరించారు.



ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న బంధువులు

విషాదంలోనూ ఔదార్యం



విష్ణు (ఫైల్)

ఊట్కూర్: పుట్టెడు దుఃఖంలోనూ తన భర్త కళ్లను దానంచేసి ఔదార్యం చాటుకుందో భార్య. భర్తకు ఇచ్చిన మాట ప్రకారం లయన్స్ క్లబ్ వారికి కళ్లను దానంచేసి ఆదర్శంగా నిలిచింది. వివరాల్లోకి వెళ్తే.. ఊట్కూర్ మండలం పులిమామిడి గ్రామానికి చెందిన దాసరి విష్ణు (40) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడేవాడు. అతడి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఇటీవల కుటుంబ సభ్యులు మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. కాగా, తాను చనిపోతే తన కళ్లను ఆస్పత్రి వారికి దానం చేయాలని భార్య శశికళకు చెప్పాడు. అతడి కోరిక మేరకు రెండు కళ్లను లయన్స్ క్లబ్ వారికి దానం చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి ముగ్గురు పిల్లలు ఉన్నారని.. ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.